

# గడబిడ

''నరసమ్మ సంగతి నీకు తెలియదు రాజా. నేను అనుభవించివున్నాను గనక దాని తత్త్వం చెప్పగలను. డబ్బు దగ్గరకొచ్చేప్పటికి దేముడికి గూడా జడియదు. బై హుక్ ఆర్ క్రుక్ అంతా లాగేస్తుంది. పదవీ వ్యామోహం గలవారు చేసే పని అది. నెత్తిన చెయ్యి పెట్టటంలో భీతీ నీతీ లేదామెకు. సినీ ఫీల్డులో నిలదొక్కుకునేవారు భీతీ నీతీ కాశీలో వదిలేస్తారు. నరసమ్మ నరసింహావతారమెత్తి పంజా విసురుతుంది. గడబిడ చేస్తుంది. యాగీ చేస్తుంది. దుష్ప్రచారం చేస్తుంది. మొత్తానికి డబ్బు కంటపడాల్సిందే. ఆమె కొచ్చిన నిక్‌నేమ్ తెలుసా? డబ్బు మనిషి. దాని కూతురు మీదే పడిందేం నీ కన్ను? మించి పోయిందేమీ లేదు. ఆ పిల్లను వెంటేసుకు తిరక్కు తగ్గించేయ్. ఇంపాజిబుల్ అంటావేమో. పోనీ రహస్యంగా కలుసుకో. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటావా? నేను నరసమ్మకు వేలు విడిచిన మేనమామను. నా చివరి కొడుకూ నువ్వూ ఒకే యీడు. వాడు స్నేహితుల సాయంతో స్టేట్స్‌కి వెళ్లాడు. వెళ్లకు అంటే, 'పెద్ద జీతం'' అన్నాడు. ''మేడ కట్టాలి'' అన్నాడు. పరుగెత్తి పాలు తాగేకన్న కూచుని నీళ్లు తాగటం మేలు అక్కడ స్వేచ్ఛా విహంగాలున్నాయట. హుక్ చేస్తాయట. అన్నీ పెళ్లితో పని లేకుండానే జరిగిపోతాయట'' అని ఘోషపెడితే అరణ్య రోదనమైంది. దివ్యమైన సంబంధమొచ్చిందనీ, సెటిల్ చేసుకుపొమ్మనీ ఫాక్సు పంపిస్తే కిమిన్నాస్తి. పెళ్లి అఘోరించేశాడేమో. ఇల్లు మూడొంతులయి ఆగిపోయింది. నేను పూర్తి చేయగలనా?'' కూడా నడుస్తూ ప్లీడరు గుమస్తా లింగమూర్తి జోరీగలాగా చెప్పుకెళ్లాడు.

వారిద్దరూ సినిమానించి వస్తున్నారు. గేటు దాటాక కలిశారు. రాత్రి పదైంది. బస్సు అందలేదు. బండీల్లో నలుగురైదుగురెక్కి పారిబోతున్నారు. వాన వచ్చేట్టున్నది. పోవాలి.

రెండవ వ్యక్తి రాజారావు ''నా దగ్గరేమున్నదీ లాగటానికీ? నా నెత్తిన చేయెట్లా పెడుతుందీ? నేనందను. జోగీ జోగీ రాచుకుంటే బుట్టెడు బూడిద

రాలిందట. డబ్బు మనిషి గనకనే రానిచ్చిందేమో. నేనామె చేత పెట్టలేదు గాని, ఆమె కూతురికి పూర్తి ఫీజు కట్టి, పుస్తకాలు, బస్‌పాస్ కొనిచ్చాను. సీటు తెప్పించిందీ నేనే. యెందుకు యాగీ చేస్తుందో చూడాలి. వాళ్లమ్మాయికి టూమచ్ స్వేచ్ఛనిస్తున్నదనీ చూశాను. తెలివిగల పిల్లని పాడు చేసేట్టున్నదే కాపాడుదామనుకొన్నాను. ఫ్రెండ్లీగా వుంటుంది లత. ఇట్టే స్నేహం కలిసింది మా మధ్య. విదేశంలో జాబ్ చేసే చదువు చదవాలి. చదివిస్తానంటే యెగిరి గంతేసింది. మోసమేదీ? మూడేళ్ల చదువేగా? అది కాగానే నా దగ్గరకొత్తువుగాని నేను విదేశం వెళ్తున్నాను. జాబ్ వచ్చింది. నేను వెళ్లి నీకూ జాబ్ తెప్పిస్తాను అంటే చాటంత మొహం చేసుకుని గట్టిగా వాటేసుకున్నది. తెలిసే రాత్రి సినిమాకు లతను నాతో వదిలింది''. ''ఇలా లోపలే ఆలోచిస్తూ అడుగులు త్వరగానే వేశాడు రాజారావు. టపటపమని పెద్ద చినుకులు పడినై. పది నిమిషాల్లో మనుషుల్ని తడిపేసింది వాన.

2

నరసమ్మకి ఒళ్లు రవులుకు పోయింది. ''నన్నే వంచిస్తాడుగా? యెవరనుకున్నాడో? దిక్కూ మొక్కూ లేని విడో యేంచేయగలదనుకున్నట్టున్నాడు. పిలక చిక్కకుండా, దూరతీరాలకు వుడాయిస్తున్నాననుకున్నాడేమో వంచకుడు. నా తడాఖా చూపుతా!'' కదలక మంచం మధ్య కూచుని కనులెర్రజేసింది. ముక్కు నలుపుకున్నది. గూడెగరేసింది. యడమ అరకాలు దురద పెట్టింది. యడమ పాదం ప్రయాణం. కుడిపాదం కుదురుగా వుంచుతుంది.

''నా తెలివి క్కువ మొద్దు కూతురు వంచకుని తీయని మాటలకు పరవశించింది. పరవశత్త్వమ్ మరణము. డబ్బు గుంజటమే రాదు లతకి. దర్పం. మొత్తం ఫీజు చెల్లించాడని యేడుస్తున్నది. పుస్తకాలకి దుస్తులకీ ఖర్చుచేశాడని శోకించింది. అంత మాత్రానికే దగుల్బాజీని నమ్ముతారా? తెలివి తేటలేవీ లాగ గలిగినంత లాగగలిగిందా? గడుసు పిండం కాకపోతే నా చేత నాలుగు వేలయినా వుంచక, ''అది వాడుకుంటూ వుండండి మెల్లిగా యింకా పంపిస్తా'' అనక టింగు

రంగా అని విమాన మెక్కి యెగిరిపోతాడా? వీసా రాలేదని పస్తాయించా. చేతబెట్టి మరీ విమానమెక్కుతాడని నమ్మాను. వాడటు యెగిరిపోయాడు. ఇది మంచమెక్కింది. క్లాసులకెటెండ్ గాలేనంటుంది. వాడితో కుమ్మక్కయి నా పరువు తీసినట్టున్నది. దీనికీ వంచించటం తర్ఫీదిచ్చాడేమో. దీని తాత రావాలి. నన్ను మోసగించటానికి'' అని పళ్లు పటపటాకొరికింది. మలేరియా నరసమ్మ ఫ్రెండు. సమయాని కాదుకుంటుంది. సీజన్‌కి వచ్చి చూసిపోతూ వుంటుంది. వుష్ణమాపకంలో పాదరసం వురకలు వేస్తూ పైకిపోతున్నది. తలకు వాసిన గట్టింది నరసమ్మ. అరేబియన్సు ఒక చట్రం తలకు బిగిస్తారు అట్లా. కడుపులో మంట. ఆకలీ నీరసం. దాహం కన్న అహం పెరిగింది. అంతా మంచి నిద్రలో వున్నారు. పాత బట్ట కప్పుకుని, దానిమీద పాత దుప్పటి కప్పుకుని బయటికొచ్చింది. తలుపు తాళం వేసి తాళం చెవి కిటికీ లోంచి లోపలికి విసిరింది. రోడ్డెక్కింది. కాళ్లు అలవాటు ప్రకారం రైల్వే స్టేషన్ వేపు నడిచినై. చెప్పులన్నా లేవు. కానీ రొంటిన డబ్బున్నది. నలభై అయిదు మైళ్ల దూరాన, దాయాది అన్న క్రిమనల్లాయరున్నాడు. వాడింట్లోనే పక్క భాగంలో యీ వంచకుడు అద్దెకుండి వుద్యోగం వెలిగిస్తూ వుండేవాడు.

స్టేషనులో అడుగుంచగానే రైలు ప్లాట్‌ఫామ్ మీది కొచ్చింది టికెట్ కొని గేటుదాటి రైలెక్కింది నరసమ్మ.

బయలుదేరకపోతే గడబిడ చేస్తుంది నరసమ్మ అని తెలిసిన దానిలా రైలు కూతవేసి బయలుదేరింది.

3

తెల్లారుజామున అన్న యిల్లు చేరిన నరసమ్మ, తలుపు తీసి లోపలికి తీసికెళ్లిన వదిన కాళ్ల ముందు కూలి భోరున యేడ్చి, విలవిలలాడుతూ క్లుప్తంగా సోదివెళ్లబోసింది. తప్పు విదేశమేగిన నమ్మక ద్రోహిదేనని సోది సారాంశం.

వదిన సాంబమ్మకి నరసమ్మ సైకాలజీ తెలుసు. ఆవిడ సైకాలజీ ఆచార్య పదవీ విరమణ చేసి నెలే అయింది. వీపు మీద రాచి ఓదార్చి, మొహం కడిగించి వేడి

కాఫీ తాగించింది.

''నువే రాబట్టక పోయావూ వదినా? లత తండ్రి పోలిక. భోళా పిల్ల. భారం దాని మీదెందుకు వేశావూ? తెలిసీ తెలియని యీడు లతది''.

''అన్యాయం వదినా. దానికి వశమైనాడు గాని నాకు గాదు గదా. యేదీ తీరిగ్గా మాట్లాడనన్నా లేదు'' అని యేడిచింది.

అన్న లింగమూర్తి యేడుపు విని లేచాడు. తాపీగా కాలకృత్యాలు కానిచ్చాడు. కాఫీ కోసం వచ్చి పేము కుర్చీలో కూచున్నాడు.

నరసమ్మ ఆయన కాళ్లు చుట్టేసింది. తల యిటూ అటూ కదిలిస్తూ భళ్లున యేడుస్తుంటే వాసిన కట్టిన గుడ్డ వూడింది. ముసుగు తొలగింది. సగం సగం నెరిసిన గుండు చూశాడన్న.

''కొంపలంటుకున్నట్టు యేడుస్తున్నా వెందుకు నరుసూ? చెప్పదలచిన పాయింట్ యెత్తుకో. చేయగలిగింది చేస్తా'' అన్నాడు. భార్యా కాఫీ అందించింది. సిప్ చేయసాగాడు రామమూర్తి.

''అంటుకుంటేనే పరుగెత్తుకొచ్చానన్నయ్యా. నీ యింట్లో అద్దెకుండి విదేశం వుడాయించిన వంచకుడు నీతో ఏమైనా చెప్పాడా? సామానేం చేశాడు? పుత్రవుడియంగా యెలా వెళ్లాడు? విమానం వాడికోసం యింటి ముందాగిందా?''

ఆవులిస్తే ప్రేవులు లెక్కిస్తాడు రామమూర్తి. పక్క వాటాలో వుండి వెళ్లిన రాజారావు. పెద్ద మనిషి తరహాగా వుంటూ, ఠంచన్‌గా అద్దె చెల్లిస్తూ లతను వెంటేసుకొస్తున్నప్పుడే అనుమానించాడు.

''చూతం'' అనుకున్నాడు. దాయాది మేనగోడలు లత సాంబమ్మకి మాలిమే. సాంబమ్మ కంప్లెయింట్ చేయలేదింతవరకు.

''సామానా? నరుసూ! అందరికీ పంచేశాడు. కొంత లారీలో వేయించి తన వాళ్లకందజేయమని డబ్బు కట్టి అడ్రసిచ్చాడు. విదేశీ జాబ్ రాదని

నిరాశపడ్డాడు. హఠాత్తుగా వూడిపడింది ఆర్డర్. అందలమెక్కినట్టు పొంగిపోయాడు రాజారావు'' అని ఆపాడు.

''నీతో యేమనలేదూ? నీ మేనగోడల్ని వెంటేసుకొచ్చేవాడుగా'' కళ్లు తుడుచుకుని ముసుగు దిద్దుకుని కూచున్నది.

''రాదనుకున్న విలువైన జాబ్ వచ్చింది పోతున్నా. అన్నాడంతే''

'పెళ్లి మాటా, పిల్ల మాటా, దాని గతీ మాట మాత్రంగానైనా యెత్త లేదూ? నీ మేనగోడలేగా'' లా పాయింట్ యెత్తింది.

''నేనే నవ్వుతూ ఆ టాపిక్ యెత్తా. పెళ్లి చేసుకుని వెళ్లవా? అక్కడ స్వేచ్ఛా ప్రణయాలుంటాయట. వాటితోనే అన్నీ జరిగిపోతాయట. నా తోటి లాయరు చెప్పాడు. వాళ్లబ్బాయి వెళ్లాడు. తెలియక తగాయదాలో యిరుకున్నాడట'' అన్నా నరుసూ. ''నా ఫియాన్సీ చదువుతున్నది. డిగ్రీ తీసుకుని నా దగ్గర కొచ్చేస్తుంది ఈ లోపలనే నేనామె రాక కన్నీ సిద్ధం చేస్తా'' అని నవ్వుతూ వెళ్లిపోయాడు.

''డబ్బు సంగతేం చెప్పలేదూ? దాన్ని నేను పోషించాలా, పురిటి ఖర్చులు పెట్టుకోవాలా? దగాపడ్డానన్నయ్యా. వాడు పేర్కొన్న ఫియాన్సీ నీ మేనగోడలే. నువ్వు వాడి సంగతి తేల్చాలి'' చివ్వున లేచి నడుంకట్టింది నరసమ్మ.

''దీని చేత డబ్బుపెట్టి వెళ్లలేదు గాబోలు రాజారావు. డబ్బు కంటబడకపోతే యిది చేసే గడబిడ యాగీ వాడికి తెలియవేమో'' అనుకున్నాడు. కాఫీ పూర్తి అయింది. గుమస్తా వచ్చి హాలులో నిలబడ్డాడు. రామమూర్తి కాఫీ కప్పు భార్యకిచ్చి లేచిపోయాడు.

''వెళ్తా వదినా. నిమ్మకి నీరెత్తినట్టు మాట్లాడాడు నీ మొగుడు. ఈ సంగతేదో నేనే తేల్చాలి. వీడూ వాడి పక్షమే లాగున్నది'' అని దొడ్డి దోవగుండా వెళ్లిపోవాలని నడిచింది నరసమ్మ.

''జ్వరం జారలేదు వదినా. మొహం జేవురించే వున్నది. వళ్లు కాల్తున్నది.

జ్వరం జారాక వెళ్ళవుగాని. మొదటే జాగర్త పడాలి. యెందుకు రానిచ్చావు.యెందుకు పోనిచ్చావు?'' అన్నది సాంబమ్మ.

'' ఈ జరం నన్నేం చేస్తుందీ? వంచకుడు చేసిన హాని కన్న యెక్కువ హాని చేస్తుందా? పిల్ల గతేమిటో తేల్చాలి. అడ్రసన్నా లేదు. విమానం కూలిందేమో. అక్కడెవతన్నా వలలోనే వేసుకున్నదేమో? వుత్తరమూ లేదు. పిల్ల మంచంలో వున్నది. మంగమ్మను సంప్రదించాలి'' అని విదిలించి వెళ్లిపోయింది నరసమ్మ.

సాంబమ్మ నోటిమీద చెయ్యేసుకున్నది.

4

ఆలోచిస్తూనే పథకాలు వేస్తూనే, కాలుగాలిన పిల్లిలాగా, వూళ్ల వెంట తిరిగింది నరసమ్మ. పాత వైరం మరచి దాయాదుల యిళ్లకెళ్లి, అన్యాయం జరిగిపోయిందనీ, వంచించి వెళ్లిపోయాడనీ, పిల్లకు చదువు లేదు, గౌరవమూ లేదు, మంచానబడిందనీ గాలి తిని బతికుండాలనీ వుద్దేశమనీ, కల్లబొల్లి యేడ్పులూ గడబిడలూ యాగీలు చేసింది.

దాయాదులకు మంచి అవకాశం అందిందని, యెందుకొదులుకోవాలని స్కోర్ చేయాలని రాజారావు వేపు దగ్గర వారితోనూ దూరపువారితోనూ వాదులాడి, తలపడి, నోరు చేయీ జాడించి శిఖపట్ల గోత్రం వరకూ వెళ్లారు. టపాకాయల మేడతో వూరు మార్మోగినట్లు మార్మోగింది వూరు.

క్రమంగా చప్పబడి, టపాకాయ లైపోయినట్లు, కావేషాలు, ఆవేశాలూ, తగ్గాయి.

కాని నర్సమ్మ ప్రచ్ఛన్న యుద్ధం సాగిస్తూనే వున్నది. దాయాదులను రెచ్చగొడుతూనే వున్నది. గడబిడ చేస్తూనే వున్నది.

'పెద్దదాని అవసరాలుకూ నేనే ఆదుకున్నానన్నయ్యా. దాని మొగుడూ యేమి రాల్చేవాడు గాదు. కొడుకులు ఫైనల్సులో కొచ్చి తేతేతే అనటమే గాని

ట్యూషనన్నా చూసుకోరు. మహా కష్టదశ. కష్ట జీవిని. ఇన్నీ భరించటానికే పుట్టానేమో. దరిద్రుడు తల గడగబోతే వడగళ్ల వాన పడిందని సామెతలాగా, కూతురంది వస్తున్నదని ఆశిస్తే వంచించి యెటో పోయాడు. నన్ను గేలిచేయటానికీ, దుయ్యబట్టటానికీ వస్తారు చుట్టాలు ఆదుకోటానికి వస్తున్నారా? దీనికెంత కష్టమొచ్చిందే అని సానుభూతి చూపే వారున్నారా? నీకు తెలియకుండానే వచ్చాడా? వచ్చాడే అందాము. సమయం చూసి రోకలితో తలపగలగొట్టక యిపుడు గడబిడ చేస్తే లాభిస్తుందా? రోలులో తలదూర్చి రోకటిపోటుకి వెరిచినట్లున్నది నీ తరహా అని నన్నే తప్పు పడుతున్నారు. వాడిని తప్పుపడుతున్నారా?'' అని వల వలా యేడ్చింది దాయాదుల యెదుట. ''మంగమ్మ నన్ను మోసగించింది పూర్ణా! సమయం మించిపోయింది సరినెలలు. ప్రమాదం. కేసౌతుంది. మొదటే యెందుకు రాలేదు? యేం చేస్తున్నావు? బిడ్డల గన్నదానివేగా? అంత యిబ్బందిగా అవమానంగా వుంటే బిడ్డనిక్కడికి తీసుకురా ఉచితంగా డెలివరీ చేస్తాను. అసలు డబ్బు రాలేదని మొత్తుకుంటున్నావేమో. నాటకమాడుతున్నావేమో? అప్రతిష్ఠ. వెలి. అనిగాదేమో'' అని తలవాచేట్టు తిట్టి గెంటేసింది పూర్ణా'' అని భోరుమన్నది నరసమ్మ, స్నేహితురాలు పూర్ణమ్మ దగ్గిర.

## 5

కొడుకు శేఖరానికి మైల్డ్‌గా స్ట్రోక్ వచ్చిందని కబురందితే తల్లి జానకమ్మ వూరడించింది. నడ్డి నెప్పితో లేవలేడని తెలిసి వుపచారం చేసింది. మంచి భోజనం తినిపించింది. మంచం పక్కన కూచుని కథలాగా నరసమ్మ చేస్తున్న గడబిడ చెప్పింది వినోదానికి. సేదతీరుతూ కోలుకుంటున్న కొడుకు శేఖరం నవ్వుతూ అన్నాడు.

''నరసమ్మత్త అంతే లేమ్మా యెవరికి తెలీదూ? డబ్బు కంటబడేదాకా గడబిడ చేస్తూనే వుంటుంది. తిరిగే కాలూ తిట్టే నోరూ. డబ్బు కంటబడగానే అత్త నోరు మూతబడుతుంది. ఇకిలిస్తుంది. దేశంగాని దేశం వెళ్లిన రాజారావు స్థిరపడద్దూ? సాయం అంతం తేలిగ్గా అందుతుందా? అక్కడి సమస్య లేమిటో? ఇక్కడి విషయం తెలియదేమో. చదువుకుంటూ వుంటుందని అనుకుని

వుంటాడు. పందెం వేసి గెలవచ్చమ్మా. అనుమానం లేదు గెలవచ్చు. లత పేరగానీ, అత్త పేరగానీ డ్రాప్సు రాగానే గడబిడ చేయటం ఆపేస్తుందత్త. అంతా సజావుగానే సాగిపోతుంది. లత చదువు ఆగిపోదు. తరవాత కంటిన్యూ చేసి పూర్తి చేయచ్చు. అది టెక్నికల్ కోర్సే. మొత్తం ఫీజు చెల్లించాడు. అనవసరంగా మూడు వూళ్లలో పొగ లేవదీసి గడబిడ చేస్తూ తిరిగింది అత్త. నా మాటలు నిజమౌతాయి చూడు'' అని అలిసి కళ్లు మూసుకున్నాడు శేఖరం.